క్లుప్తంగా

సేవలకు గుర్తింపు

● వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం


కారం నాగరాజు


జిట్టా నాగేష్‌యాదవ్

పత్తికొండ టౌన్/తుగ్గలి/: కష్టపడి పనిచేసిన కార్యకర్తలను వైఎస్సార్‌సీపీ గుర్తించింది. పార్టీ అభివృద్ధికి కృషిచేసిన వారికి పదవులు కట్టబెట్టింది. మండల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. పత్తికొండ మండల అధ్యక్షుడిగా పందికోన నాగరాజు, తుగ్గలి మండల అధ్యక్షుడిగా జి.ఎర్రగుడి జిట్టా నాగేష్‌యాదవ్‌లను పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు కేంద్ర పార్టీ కార్యాలయం పేర్కొంది.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

ఆలూరు రూరల్: పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు అక్టోబర్ 3 నుంచి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సివిల్, మెకానికల్ కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయని ఆసక్తి ఉన్న వారు పాలిసెట్ ర్యాంకు కార్డు, హాల్ టికెట్, కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రూ.7 వేల ఫీజుతో కళాశాలతో హాజరు కావాలన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

పత్తికొండ రూరల్: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శనివారం జిల్లా సబ్‌రిజిస్ట్రార్ కల్యాణి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఉన్న నాన్‌జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లకు ప్రత్యామ్నాయంగా ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఈ-స్టాంప్ వివరాలపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి వాస్తవాలు తెలియజేయాలని సిబ్బందికి సూచించారు.

ప్రైవేట్ స్కూల్ ఎదుట విద్యార్థి సంఘాల నిరసన

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కోటేకల్ గ్రామంలో ఉన్న తెలుగు నారాయణ ప్రైవేట్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యార్థి సంఘాల నాయకులు నరసన్న, రఘునాథ్, ఆఫ్రిది, వెంకటేష్ శనివారం స్కూల్ ఎదుట నిరసన తెలిపారు. ఫీజు కట్టలేదని 1వ తరగతి విద్యార్థి హానిష్‌ను హెచ్‌ఎం చితకబాదడం తగదన్నారు. తన కుమారుడిని ఎందుకు కొట్టారని అడగటానికి వెళ్లిన బాలుడి తల్లిని దుర్భాషలాడినట్లు తెలిపారు. స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బాలుడి తల్లితోపాటు విద్యార్థి సంఘాల నాయకులు ఎంఈఓ ఆంజనేయులకు వినతి పత్రం అందజేశారు.

నేడు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం

తుగ్గలి: కేంద్ర, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖల ఆదేశాల మేరకు స్వచ్ఛ హీ సేవే లక్ష్యంగా ప్రతి గ్రామ పంచాయతీలో మహాత్మాగాంధీ జయంతి స్ఫూర్తితో ఆదివారం గంట పాటు శ్రమదానం చేయాలని ఎంపీడీఓ సావిత్రి అన్నారు. గుర్తించిన ప్రదేశాలు, వీధులు, ప్రార్థనా మందిరాలు, విద్యా సంస్థలు, రైల్వే స్టేషన్లలో పాఠశాలు, కాలేజీల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, స్వచ్ఛభారత్ అంబాసిడర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని శ్రమదానం చేయాలన్నారు.

● **వెల్దుర్తి:** స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు శ్రమదానం చేయాలని ఈఓఆర్డీ నరసింహులు సూచించారు. శనివారం ఆయన నరసాపురం సచివాలయంలో మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు గంట పాటు తమ పరిసరాల్లోని బహిరంగ ప్రదేశాల్లో పరిశుభ్రత పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో సర్పంచ్ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ఇంటికి చేరకుండానే రైతు మృతి

● ఆర్‌ఎంపీ వైద్యం వికటించడంతోనేనని బంధువుల ఆరోపణ


రజాక్(ఫైల్)

పత్తికొండ రూరల్: పంట ఉత్పత్తులు విక్రయించేందుకు వెళ్లిన ఓ రైతు ఇంటికి చేరకుండానే మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన పత్తికొండలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. దేవనకొండ మండలం ఎం కె.కొట్టాల గ్రామానికి చెందిన రైతు రజాక్(67) ఆముదం ఉత్పత్తులు విక్రయించేందుకు తన కూతురు బీబీ, అల్లుడు బాసుతో కలిసి ఉదయం ఆదోనికి వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని మధ్యాహ్నం అల్లుడు, కూతురు గ్రామం అయిన పత్తికొండకు చేరుకున్నారు. సాయంత్రం కాళ్లు, చేతులు లాగుతున్నాయని చెప్పడంతో సాయిబాబా ఆలయం పక్కన ఉన్న క్లినిక్ వద్దకు అల్లుడు తీసుకుని వెళ్లాడు. ఆర్‌ఎంపీ సర్కార్ ఇంజక్షన్ చేశాడు. కాసేపటికే క్లినిక్ వద్దే మృత్యువాత పడ్డాడు. విషయం తెలుసుకుని ఎంకె కొట్టాల గ్రామస్తులు, బంధువులు పత్తికొండకు చేరుకుని ఆర్‌ఎంపీ వైద్యం వికటించడంతోనే మృతి చెందాడని ఆరోపిస్తూ క్లినిక్ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆర్‌ఎంపీని అదుపులోకి తీసుకున్నారు. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని సీఐ మురళీ మోహన్ తెలిపారు.

ఆరోగ్యం జగనన్న ఇచ్చే భాగ్యం

● ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
● అట్టహాసంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రారంభం
● ప్రజల నుంచి విశేష స్పందన


బొందిమడుగులలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి


అమకతాడులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

తుగ్గలి/కృష్ణగిరి: అందరికీ సంపూర్ణ ఆరోగ్య భాగ్యమే లక్ష్యంగా రాష్ట్రం ప్రభుత్వం ముందుకెళ్తోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శనివారం తుగ్గలి మండలం బొందిమడుగుల, కృష్ణగిరి మండలం అమకతాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలనను ఆమె ప్రారంభించి మాట్లాడారు. పేదలకు వైద్య సేవలను మరింత చేరువ చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నూతన అధ్యాయాన్ని సృష్టిస్తోందన్నారు. ఇలాంటి కార్యక్రమం రాష్ట్రంలో, దేశంలో ఎన్నడూ జరగలేదన్నారు. ఇంటి వద్దకే వైద్యులు వచ్చి వైద్యం అందించే ప్రక్రియ ఇప్పటి వరకు ఎవరూ చేయలేదన్నారు. నెల రోజుల పాటు నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య శిబిరానికి వచ్చిన వందలాది మందికి వైద్యులు మరోసారి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ, సచివాలయ మండల కన్వీనర్లు నాగేష్, హనుమంతు, నాయకులు రామచంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, హుసేన్, మునిరెడ్డి, ఈశ్వరరెడ్డి, సుంకన్న పాల్గొన్నారు.

● అమకతాడు వైద్య శిబిరాన్ని జిల్లా ప్రోగ్రాం అధికారి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. వైద్యులు అఖిలాష, అర్చన, ప్రసాద్, శ్రీవాణి, వరప్రసాద్‌తోపాటు ఆరోగ్య, ఆశా,ఆరోగ్య మిత్ర సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, ఎంపీడీఓ విశ్వమోహన్, సర్పంచ్ బోయ సర్వేశ్వరి పాల్గొన్నారు.

● **పత్తికొండటౌన్:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ ఎం.నారాయణదాసు, మాజీ ఎంపీపీ ఎస్.నాగరత్నమ్మ, పత్తికొండ సర్పంచ్ కొమ్ము దీపిక శనివారం ప్రారంభించారు. వైద్యులు సుజాత, రమేశ్, సందీప్‌రెడ్డి తదితరులు ప్రజలకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కవిత, తహసీల్దార్ విష్ణుప్రసాద్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, మండల కన్వీనర్ కారం నాగరాజు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ పాల్గొన్నారు.

● **వెల్దుర్తి:** స్థానిక బాలుర హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన హెల్త్ క్యాంపు విజయవంతమైంది. ఎంపీడీఓ శ్రీనివాసరావ్ ఆధ్వర్యంలో రామళ్లకోట, గోవర్ధనగిరి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ప్రతిభ, నవీన్ కుమార్, స్పెషలిస్టు డాక్టర్లు పవన్‌తేజ, వెంకటేశ్ నాయక్, కంటి డాక్టర్ కవిత, ఆరోగ్య సిబ్బంది పలువురికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మండల ప్రత్యేకాధికారి ఎస్సీ కార్పొరేషన్ జిల్లా ఈడీ శ్రీనివాసకుమార్, తహసీల్దార్ శివరాముడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ దాదిపోగు సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజ, పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడు తదితరులు హెల్త్ క్యాంపును పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహారం స్టాల్ ఆకట్టుకుంది.

● **మద్దికెర:** మండల పరిధిలోని బసినేపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని జిల్లా డిప్యూటీ కలెక్టర్ రమాదేవి పరిశీలించారు. వైద్యాధికారులు నగేష్, పవన్, విజయభారతి పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు.


పత్తికొండలో సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ నారాయణదాసు, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, సర్పంచ్ దీపిక


వెల్దుర్తిలో కళ్ల అద్దాలు అందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


వెల్దుర్తి శిబిరానికి హాజరైన వారికి పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

గతంలో ఇబ్బంది పడేవాళ్లం



ఏ చిన్న జబ్బు వచ్చినా వైద్యం కోసం పత్తికొండ, డోన్‌కు వెళ్లాల్సి వచ్చేది. ఇంత వరకు ఇంటికి వచ్చి ఎలా ఉన్నారని అడిగిన వారు లేరు. ఇప్పుడు ఇంటి వద్దకే వచ్చి వైద్యం అందిస్తున్నారు. ప్రభుత్వం చాలా మంచి పని చేస్తోంది. గ్రామానికే వచ్చి పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇవ్వడం సంతోషంగా ఉంది.

– ఈరన్న, బొందిమడుగుల

ఇంటికి వచ్చి వైద్య పరీక్షలు చేశారు



నాకు వెన్నెముక ఆపరేషన్ జరిగింది. నొప్పితో బాధపడుతున్నాను. ఐదు రోజుల క్రితం వైద్య సిబ్బంది మా ఇంటికి వచ్చి వైద్య పరీక్షలు చేశారు. ఇప్పుడు బొందిమడుగులలో వైద్య శిబిరంలో మళ్లీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చారు. మాలాంటోళ్ల వ్యయప్రయాసలు పడకుండా ఇంటికే వచ్చి వైద్య పరీక్షలు చేయడం సంతోషకరం.

– ఆకాశ నారాయణమ్మ, లింగనేనిదొడ్డి

కంటి పరీక్ష చేసి అద్దాలు ఇచ్చారు



కంటి సమస్యతో ఇబ్బంది పడుతున్నా. పట్టణాలకు వెళ్లి చూపించినా నయం కాలేదు. వారం రోజుల క్రితం మా ఇంటికి వైద్య సిబ్బంది వచ్చినప్పుడు కంటి సమస్య ఉందని చెప్పడంతో టోకెన్ ఇచ్చి శిబిరానికి రమ్మన్నారు. ఈ రోజు డాక్టర్ పరీక్షించి తలలో నరాల సమస్య వల్ల కంటికి ఇబ్బంది ఉందని, మందులు వాడితే నయమవుతుందని చెప్పారు. ఇంటి వద్దకే వచ్చి డాక్టర్లు సేవలు అందించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన గొప్పగా ఉంది.

– దస్తగిరి, అమకతాడు

జగనన్న లక్ష్యం అందరికీ ఆరోగ్యం

● వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి


బనవాసిలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్/రూరల్: ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ ఆవరణం, ఎమ్మిగనూరు మండలం బనవాసి గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఆయన ప్రారంభించారు. వైద్యులు వీణ, సాయిజాహ్నవి, శారద, శ్రీనివాసులు తదితరులు పలువురికి వైద్య చికిత్సలు అందించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడా రు. ఇళ్ల వద్దకే వైద్య సిబ్బంది వచ్చి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని చికిత్సలందించే ప్రక్రియ దేశంలో మొదటి సారిగా వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రతిఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సాసీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, మున్సిపల్ డీఈలు మనోహర్‌రెడ్డి, నీరజ, ఏఈ శరత్‌కుమార్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యుకె రాజశేఖర్, కౌన్సిలర్లు బజారి, డిష్ కేశవరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, కె.విశ్వనాథ్, ప్రతాప్‌రెడ్డి, రుద్రాక్షల బజారి, బనవాసి కార్యక్రమంలో ఎంపీపీ గొల్ల కేశన్న, సర్పంచ్ బి.లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

● **నందవరం:** మండల పరిధిలోని గురజాల గ్రామంలో సర్పంచ్ వీరస్వామి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథ రామయ్య పర్యవేక్షించారు. సీహెచ్‌సీ డాక్టర్లు సౌజన్యలత, విజయ భారతి.. పలువురికి వైద్య సేవలు అందించారు. చిన్న పిల్లల స్పెషలిస్టు డాక్టర్ శ్రీచరణ్ చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

● **గోనెగండ్ల:** మండలంలోని బైలుప్పల గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని జిల్లా మలేరియా అధికారి నూకరాజు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్, తహసీల్దార్ వేణుగోపాల్ ప్రారంభించారు. అనంతరం జనరల్ ఫిజిషియన్, గైనకాలజిస్ట్, ఆప్తాల్మిక్ వైద్యులు తరుణ్, స్మృతి, రమేష్, అపర్ణ, కార్తిక్ తదితరులు పలువురికి బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, మూత్రం, మలేరియా, డెంగీ, దీర్ఘకాలిక వ్యాధులు తదితర పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బజారి, ఎంపీటీసీ బలరామ్‌రెడ్డి పాల్గొన్నారు.


గురజాలలో ఆరోగ్య సురక్ష కార్రమానికి హారైన గ్రామస్తులు

పరీక్షించి మందులు ఇచ్చారు



మోకాళ్ల నొప్పులతో బాధపడేదాన్ని. జగనన్న ఆరోగ్య సురక్షలో సమస్యను వైద్య సిబ్బందికి వివరించాను. ఎలాంటి ఫీజు తీసుకోకుండా పరీక్షించి పదిరోజులకు సరిపోయే మందులిచ్చారు. ఇలా వైద్యం అందించడం మొదటి సారి చూస్తున్నా.

– యశోదమ్మ, ఎమ్మిగనూరు పట్టణం

కళ్ల సమస్య చూపించుకున్నా



కళ్లలో నీరు కారుతుంటే వైద్యులకు చూపించుకున్నా. పరీక్షించి మందులు ఉచితంగా ఇచ్చారు. కాళ్ల నొప్పులకు కూడా మందులు ఇచ్చారు. ఇలాంటి ఉచిత వైద్య సేవలు పొందడం బాగుంది.

– అల్లెన్న, మునెప్ప నగర్, ఎమ్మిగనూరు పట్టణం

ఇబ్బందులు పడేవాళ్లం



కొంతకాలంగా మోకాళ్ల నొప్పితో బాధపడుతున్నాను. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామంలో ఆస్పత్రి సిబ్బంది ఇంటికి వచ్చి పరీక్షలు చేశారు. గతంలో ఆరోగ్యం బాగోలేకపోతే గోనెగండ్లకో ఎమ్మిగనూరుకో వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు మా గ్రామంలోనే వైద్య శిబిరంలో చికిత్స అందించి మందులు ఉచితంగా ఇవ్వడం సంతోషకరం.

– దుగ్గెన్న, బైలుప్ల గ్రామం

ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆలూరు రూరల్: ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్, డీఐఓ డాక్టర్ ప్రవీణ్ అన్నారు. శనివారం ఆలూరు సచివాలయం-1లో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌ను వారు పర్యవేక్షించి రోగులకు మందులు అందించారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులో శనివారం పలువురికి చికిత్స చేసి మందులు అందించారు. ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో రోగులకు పౌష్టికారం అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీఓ అల్లబకష్, ఈఓఆర్డీ ప్రకాష్ నాయుడు, మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ మారుతి, స్పెషలిస్ట్ డాక్టర్లు గుల్జాన్, పుష్పలత హెల్త్ సూపర్వైజర్లు కళావతి, ఆంధ్రూస్, బాషా, టెక్నీషియన్ పురుషోత్తం ఉన్నారు.

● **దేవనకొండ:** మండలంలోని కుంకనూరు ఎంపీపీ స్కూల్‌లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ ఇద్రూష్‌బాషా, వైద్యాధికారి విజయభాస్కర్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ వైద్యులు కళ్యాణ్, అతావుల్లా, స్పెషలిస్ట్ డాక్టర్లు పుష్పలత, వీరరత్నాకర్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది హాజరై ప్రజలకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు లుముంబా పాల్గొన్నారు.

● **హాలహర్వి:** మండలంలోని బాపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శనివారం డివిజన్ లెవెల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నాగేశ్వర రావు, మండల ప్రత్యేకాధికారి రామాంజనేయులు ప్రారంభించారు. బీపీ షుగర్, ఆస్తమా, కళ్ల జబ్బులు, ఇతర దీర్ఘకాలిక జబ్బులకు వైద్యులు వైద్యం అందించి, మందులను పంపిణీ చేశారు. అనంతరం పోషకాహార స్టాల్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున, ఎంపీడీఓ ఆంతోనీ, జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమప్పచౌదరి, బాపురం సర్పంచ్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● **హొళగుంద:** జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపుకు విశేష స్పందన వచ్చింది. మండలంలోని ఇంగళదహాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపులో 4 వందల మంది రోగులకు చికిత్స చే సినట్లు అధికారులు వెల్లడించారు. సర్పంచ్ ప్రభావతి,ఎంపీడీఓ సుభాషిణి, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ సత్యవతి హొళగుంద, గజ్జహళ్లి పీహెచ్‌సీ డాక్టర్లు న్యూటన్, రాధమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాద రెడ్డి,ఎంపీటీసీ మల్లికార్జున అన్ని శాఖల అధికారులు ఉన్నారు.

పరీక్షలు చేసి మందులిచ్చారు



నాకు గత 20 రోజుల నుంచి కంటి నొప్పి ఉండేది. వారం క్రితం ఏఎన్ఎంలు మా ఇంటికి వచ్చి పరీక్షలు చేసి టోకెన్ ఇచ్చారు. ఈ రోజు ఉదయం వలంటీర్, ఆశా కార్యకర్తలు ఇంటికి వచ్చి శిబిరానికి తీసుకొచ్చి వైద్యం చేయించారు. మందులు ఇచ్చారు. గతంలో ఆస్పత్రికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు మా ఏరియాకే వచ్చి వైద్యం అందిస్తున్నారు.

– శివ గంగమ్మ, ఆలూరు

సబ్సిడీ శనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



విత్తనాలను పంపిణీ చేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

● మంత్రి గుమ్మనూరు జయరాం

ఆస్పరి: సబ్సిడీ శనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కార్మిక శాఖ మంత్రి గుమ్మ నూరు జయరాం అన్నారు. శనివారం ఆర్‌బీకేలో రైతులకు సబ్సిడీ శనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడారు. కార్యక్రమంలో దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, సర్పంచ్ మూలింటి రాధమ్మ, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన, ఆలూరు ఏడీఏ సునీత, ఏఓ నరేంద్రకుమార్, మండల వ్యవసాయ మండలి చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నిధుల కొరత రానివ్వం

పత్తికొండటౌన్: నాడు-నేడు పనులకు నిధుల కొరత రానివ్వమని సమగ్రశిక్ష ప్రాజెక్ట్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్ అన్నారు. శనివారం కస్తూర్బా విద్యాలయం, ఏపీ మోడల్‌స్కూల్‌లను తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయసిబ్బందితో మాట్లాడారు. మన బడి నాడు-నేడు మొదటి విడత కింద జిల్లాలో చేపట్టిన పనుల్లో రూ.3.5 కోట్లు, రెండవ విడతలో రూ.12 కోట్లు ప్రస్తుతం విద్యార్థుల తల్లిదండ్రులు బ్యాంకు ఖాతాల్లో ఉన్నాయన్నారు. ఈ నిధులను ప్రాధాన్యత క్రమంలో పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాల్లో వివిధ పనులకు సర్దుబాటు చేస్తామన్నారు. కొందరు ప్రధానోపాధ్యాయులు అలా చేయడానికి సహకరించడం లేదని ఎంఈఓలు ఫిర్యాదు చేయగా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కోఆర్డినేటర్ వెంట జీసీడీఓ సునీత, ఎంఈఓలు మస్తాన్‌వలి, రమేశ్ ఉన్నారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కోఆర్డినేటర్ వేణుగోపాల్

సంక్షిప్తం

మట్టిబొమ్మల రచయిత -మానవతా పుస్తకం ఆవిష్కరణ

దేవనకొండ: మండలకేంద్రంలోని ఎఫ్ఆర్ హైస్కూల్‌లో 'మట్టి బొమ్మలు రచయిత-మానవతా' పుస్తకాన్ని శనివారం కరస్పాండెంట్ రఘునాథ్, హెచ్‌ఎం ఉచ్చీరప్ప, తెలుగు పండితులు సెక్యూరి భాస్కర్ చేతులమీదుగా ఆవిష్కరించారు. సమావేశంలో పుస్తక రచయిత నవప్పగారి ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

శనగ విత్తనాలు పంపిణీ

ఆలూరు రూరల్: మండలంలోని మొలగవల్లి, పెద్దహోతూరు, మరకట్టు గ్రామాల్లో అధికారులు శనివారం రైతులకు సబ్సిడీ పప్పుశనగ విత్తనాలను పంపిణీ చేశారు.

● **హాలహర్వి:** మండలకేంద్రంలోని రైతుభరోసా కేంద్రంలో శనివారం జెడ్పీటీసీ లింగప్ప, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ భీమప్ప చౌదరి రైతులకు పప్పుశనగ విత్తనాలను పంపిణీ చేశారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వైష్ణవి జూనియర్ కళాశాలలో గాంధీ జయంతి సందర్భంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

బాధితునికి న్యాయం చేయాలి

ఆస్పరి: ఇటీవల ఎద్దల బండిని బైక్ ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆస్పరి గ్రామానికి చెందిన మాల వీరేష్‌కు న్యాయం చేయాలని మాల మహానాడు సంఘం నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.

గాయపడిన వ్యక్తి మృతి

ఆస్పరి: స్థానిక పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం రాత్రి స్కూటర్ ప్రమాదంలో గాయపడిన పత్తికొండ మండలం అటికెలగుండు గ్రామానికి చెందిన బోయ మేడికుంద్ ఆనంద్ (42) కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో కోలుకోలేక శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే

పత్తికొండ రూరల్: రైతుల భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని తహసీల్దారు విష్ణుప్రసాద్ చక్రాళ్ల గ్రామస్తులకు వివరించారు. రీసర్వేపై సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

నందవరం: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల విద్యాధికారి-2 రఘునాథ్ వంట ఏజెన్సీ సభ్యులకు సూచించారు. శనివారం గురజాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. విద్యార్థుల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని హెచ్‌ఎం వరలక్ష్మికి సూచించారు.

పరామర్శ

కృష్ణగిరి: రెండు రోజులు క్రితం గుండెపోటుతో మృతిచెందిన ఆలంకొండ బోయ మాదన్న కుటుంబాన్ని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పర్యామర్శించారు. గ్రామానికి చేరుకుని మృతుని భార్య సాలమ్మకు ధైర్యం చెప్పారు. ఈమె వెంట పార్టీ మండల అధ్యక్షులు ఆర్‌బీ వెంకటరాముడు ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గోట్ల చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు కరె కృష్ణ కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

ఎమ్మిగనూరురూరల్: ప్రతి ఒక్కరూ పౌరుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ సీతారామయ్య సూచించారు. శనివారం మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో పౌర హక్కుల దినో త్సవం సందర్భంగా ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. సమావేశంలో తహసీల్దార్ ఆంజనేయులు, రూరల్ ఎస్ఐ నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

● **నందవరం:** మండల పరిధిలోని ముగతి ఎస్సీ కాలనీలో పౌరహక్కులపై ప్రజలకు సీఐ మోహన్‌రెడ్డి, తహసీల్దార్ నిత్యానందరాజు, ఎస్ఐ తిమ్మయ్య అవగాహన కల్పించారు.

రక్త దానం

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్‌ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు జరగాలి

గోనెగండ్ల: ప్రభుత్వ ఆస్పత్రులలోనే కాన్పుల జరగాలని డిప్యూటీ డైరెక్టర్, స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి వైద్యులకు సూచించారు. శనివారం ఆయన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈయన వెంట ఎస్‌ఓ హేమ సుందర్, డీఎస్‌ఓ సునిల్, డాక్టర్లు రవళి, రుక్సానా ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల జీతాలు పెంచాలి

దేవనకొండ: ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షులు రాజునాయక్, ఉపాధ్యక్షులు చిన్నగిడ్డయ్య కోరారు. శనివారం ఆలూరులో మంత్రి క్యాంపు కార్యాలయంలో కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాంను కలిసి వినతి పత్రం అందజేశారు.